క్లుప్తంగా

జాతరకు ఏర్పాట్లు

పార్వతీపురం టౌన్: పట్టణ ప్రజల ఇలవేల్పు జాకరమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆదివారం ఉదయం ఆరు గంటలకు పిన్నింటి రమణమూర్తి నివాసం వద్ద జాకరమ్మ జంగిడికి ఆ ఇంటి పెద్ద అప్పలనరసయ్య ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం ఆయన నివాసం వద్ద జాకరమ్మ జంగిడికి ప్రత్యేక అలంకరణ చేసి మేళతాళాల మధ్య బైపాస్ రహదారిలోని ఆలయం వద్దకు తీసుకువచ్చి అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు.

ఫారం పాండ్స్ రైతులకు ఉపయోగం



ఫారం పాండ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జడ్పీటీసీ తదితరులు

బలిజిపేట: ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో నిర్మాణాలు జరుపుతున్న ఫారం పాండ్స్ నిర్మాణాలు రైతులకు ఉపయోగకరంగా ఉంటాయని జడ్పీటీసీ ఎ.రవికుమార్ తెలిపారు. తుమరాడలో ఫారం పాండ్ నిర్మాణ భూమి పూజలో ఆయన పాల్గొన్నారు. దీనివలన భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. మామిడి తోటల్లో వీటిని ఏర్పాటు చేయడం వలన నీటికుంట నిండి అవసరమైనప్పుడు నీరు వినియోగించుకోవచ్చన్నారు. అదే విధంగా వేరొకచోట నిర్మాణం జరిపిన ఫారం పాండ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్, ఏపీఓ కేశవ్, కె.శ్రీరామూర్తి, తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టిపై శిక్షణ



మాట్లాడుతున్న డీపీఓ కొండలరావు

సీతానగరం: చెత్త నుంచి సంపద సృష్టిపై ఇస్తున్న శిక్షణను గ్రీన్ అంబాసిడర్లు వినియోగించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి కె.కొండలరావు అన్నారు. పెదబోగిలి ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రంలో చెత్త నుంచి సంపద సృష్టిపై ఇస్తున్న శిక్షణలో ఆయన శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు మండలాల నుంచి గ్రీన్ అంబాసిడర్లు, గ్రీన్ కార్లకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామాల్లో వ్యర్థాలను సేకరించిన అనంతరం తడి - పొడి చెత్తను వేరు చేసి రసాయనిక రహిత ఎరువులను తయారు చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 29 వరకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. శిక్షణలో పలు మండలాల ఈఓపీఆర్డీలు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ రమణమ్మ

సీతానగరం: మండలంలో వివిధ ప్రాంతాల నుంచి గ్రామాలకు వచ్చిన పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ బి.రమణమ్మ అన్నారు. మండల పరిషత్ కార్యాలయానికి శనివారం వచ్చిన నూతన పంచాయతీ కార్యదర్శులు ఎంపీపీ చాంబర్‌లో ఆమెను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారితో ఎంపీపీ మాట్లాడుతూ గతంలో బదిలీపై వెళ్లిన పంచాయతీ కార్యదర్శుల స్థానంలో కొత్తవారిని నియమించిన వారంతా ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీడీఓ పి.త్రివిక్రమరావును కలిశారు.

నవోదయం ప్రచార రథం ప్రారంభం



నవోదయం ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న సీఐ దాసు

సాలూరు: సారా నివారణ కోసం నవోదయం 2.0 ప్రచార రథాన్ని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ దాసు తన కార్యాలయం వద్ద శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా నివారణకు ప్రజలందరి సహకారం తప్పనిసరని అన్నారు. సారా నియంత్రణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ రథం ద్వారా సారా వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన పెంపొందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పెరుగుతున్న పెట్టుబడులు..

దిగుబడులపై సన్నగిల్లుతున్న ఆశలు

- రబీలో నువ్వు పంట సాగు
- తెగుళ్ల నివారణకు మందుల పిచికారీ



సాగులో నువ్వు పంట

బలిజిపేట: ఈ ఏడాది రబీలో నువ్వుల పంటను రైతులు సాగు చేస్తున్నారు. నువ్వుల పంటకు నూరు గండాలు అనే నానుడి ఉంది. ఆ ప్రకారం పంట సాగు చేసిన మొదలు దిగుబడులు వచ్చే వరకు ఎన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నా రైతులు నష్టాలనే ఎదుర్కొనే పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లు, చీడపీడలు పంటను దెబ్బతీస్తున్నా రైతులు మొక్కవోని ధైర్యంతో మందులు పిచికారీ చేస్తూ నివారిస్తున్నారు. ఏ పంట సాగు చేసినా నష్టాలే తప్ప ఆదాయం లేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయంలో సాగు చేసిన పంటలలో దిగుబడులు వస్తే ధరలు లేక.. ధరలు ఉంటే దిగుబడులు లేక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మండలంలో సుమారు రెండు వేల ఎకరాల్లో దీని సాగు జరుగుతోంది.

సాగులో పెరిగిపోతున్న పెట్టుబడులు

ఏ పంట సాగు చేయాలన్నా పెట్టుబడులు మాత్రం తగ్గడం లేదు. నువ్వుల పంటకు ఎకరాకు రూ.15వేలకు పైనే పెట్టుబడులు పెట్టాల్సి వస్తుందంటున్నారు. సేద్యాలు, ఎరువులు, విత్తనాలు, విత్తన ఖర్చులు, కూలీ ఖర్చులు అధికమవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఒకసారి పంట దెబ్బతింటే పెట్టుబడులు కూడా దక్కని పరిస్థితి నెలకొంటోందని రైతులు వాపోతున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో పంట సాగులో దిగుబడులు వచ్చి ధరలు ఉన్నట్లయితే వ్యవసాయం గిట్టుబాటు అవుతోందని రైతులు చెబుతున్నారు. ప్రతి ఏడాది ఒక సీజన్‌లో పంటలు పండితే మరో సీజన్‌లో పంటలు పండక నష్టపోవాల్సి వస్తోందంటున్నారు. పంటలు సాగు చేశాక వాటి సంరక్షణే భారంగా మారుతోందని, పెట్టుబడులు పెరిగిపోతున్నాయని రైతులు తెలుపుతున్నారు.



దిగుబడులపై సన్నగిల్లుతున్న ఆశలు

పంట సాగు చేసిన 80రోజులకే దిగుబడులు అందుతాయి. ఈ ఏడాది నువ్వుల పంటపై రైతులు పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలయ్యాయి. మామూలుగా అన్ని అనుకూలిస్తే ఎకరాకు ఐదారు క్వింటాళ్లకు మించి దిగుబడులు రావాలి. ఈసారి ఎకరాకు చాలా తక్కువ వచ్చే అవకాశాలున్నాయంటున్నారు. మంచు ప్రభావం చూపుతోందని చెబుతున్నారు. త్వరలోనే కోత కోయాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

తెగుళ్ల నివారణకు మందుల పిచికారీ

పంట సాగు చేశాక వాటి సంరక్షణ పట్ల రైతులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రతి పంటకు తెగుళ్లు సోకుతున్నాయి. నువ్వుల పంటలో ముందు జాగ్రత్తగా మందులు పిచికారీ చేస్తున్నారు. నువ్వుల పంట సాగు చేశాక 15రోజుల నుంచే మందులు పిచికారీ చేయడం ప్రారంభించారు. పంటలు దిగుబడులు అందే సమయానికి ఐదుసార్లు మందులు పిచికారీ చేయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎకరాకు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు అదనంగా ఖర్చు చేస్తున్నామని తెలుపుతున్నారు. పంట పూత దశలో ఉన్న సమయంలో వాతావరణ మార్పులు పంటపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి.

పంటకు నష్టం వాటిల్లే అవకాశాలు

నువ్వు పంట దిగుబడులు బాగుంటాయని ఆశపడ్డాం. కానీ సాగు ప్రారంభం నుంచి మంచు ప్రభావం ఎక్కువగా ఉంది. దిగుబడులు ఆశించినంతగా వచ్చే అవకాశాలు లేవు.

– సత్యం, రైతు, పలగర, బలిజిపేట మండలం

'నవోదయం' వెల్లివిరియాలి



గ్రామాల్లో ప్రజారోగ్యానికి హాని కలిగించే సారా నిర్మూలనకు ఎక్సైజ్ అధికారులకు ప్రజలు సహకరించి తమ గ్రామాల్లో నవోదయం వెల్లివిరిసేలా చేదోడుగా ఉండాలని సీఐ డి.పద్మావతి అన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ పరిధిలోని గరుగుబిల్లి మండలం సన్యాసిరాజుపేట, కొంకిడివరం, ఉల్లిభద్ర, లక్ష్మాపురం తదితర గ్రామాల్లో సారా తాగడం వల్ల కలిగే అనర్థాలపై నవోదయం కార్యక్రమంలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఎస్ఐ, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. – సీతానగరం

ఊరు బడిని రక్షించుకుందాం...



పాఠశాలల విలీనకరణను వ్యతిరేకిస్తూ ఊరు బడిని రక్షించుకుందాం... నినాదంతో సీతానగరం మండలం పాపమ్మవలసలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీపంలో ఉన్న పాఠశాలల్లో విలీనం చేయడం, యూపీ స్కూళ్లను రద్దు చేయడం వంటి చర్యలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సి ఉందన్నారు. – సీతానగరం

నాణ్యమైన జీడిపప్పును కొనుగోలు చేయాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ ఏపీడీ సత్యంనాయుడు

సాలూరు: వీడీవీకేల ద్వారా నాణ్యమైన జీడిపప్పును కొనుగోలు చేయాలని ఐటీడీఏ ఏపీడీ సత్యంనాయుడు అన్నారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల వీడీవీకే కమిటీ సభ్యులతో జీడి పిక్కల కొనుగోలుపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏ గ్రేడ్ జీడి పిక్కల కొనుగోలు చేయాలని తెలిపారు. వీడీవీకేల ద్వారా జీడి పిక్కల కొనుగోలు చేస్తామని జీడి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కొనుగోలుపై మెలకువలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీఎంలు జయమ్మ, జయకుమార్, శివున్నాయుడు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు రాని సమావేశాలెందుకు..!



మాట్లాడుతున్న ఎంపీపీ రమణమ్మ

సీతానగరం: ప్రజల సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు నిర్వహించే మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు రాకుంటే ఈ సమావేశాలెందుకు? అని పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బి.రమణమ్మ అధ్యక్షతన మండల సమావేశం శనివారం జరిగింది. సభాధ్యక్షురాలు రమణమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యలను శాఖల వారీగా అధికారులకు వివరించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పలువురు అధికారులు సమావేశానికి రాకపోవడంపై తక్షణ చర్యలు తీసుకోవాలని సభ్యులంతా ఏకవాక్య తీర్మానం చేశారు. దీన్ని కలెక్టర్‌కు నివేదించాలని నిర్ణయించారు. మూడు నెలలుగా హాజరు కాని విద్యుత్ శాఖ అధికారితో పాటు రెండు సమావేశాలకు హాజరుకాని ఆర్అండ్‌బీ, అటవీ, పీఆర్ ప్రాజెక్ట్స్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు టి.పార్వతి, బి.కుసుమ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉపాధి వేతనదారులకు ప్రభుత్వం ఏడు వారాలుగా వేతన బిల్లులు చెల్లించడం లేదని తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా మండల కేంద్రంలో పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్న ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది ఫర్నీచరు లేదనే సాకుతో టెన్త్ పరీక్షల కేంద్రాన్ని రద్దు చేయడం దురదృష్టకరమని పలువురు మండల విద్యాశాఖ అధికారులను నిలదీశారు. ఏఓ అవినాష్ మాట్లాడుతూ రాయితీపై వ్యవసాయ పరికరాలు మంజూరయ్యాయని అవసరమైన రైతులు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ సభ్యులు మామడి బాబ్జీ, ఎంపీడీఓ త్రివిక్రమరావు, తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీఓ ప్రసాద్, ఐసీడీఎస్ పీఓ సురేఖ, ఇంజనీరింగ్ అధికారులు పవన్‌కుమార్, చంద్రమౌళి, ఇరిగేషన్ ఏఈ, ఎంఈఓలు సూరిదేముడు, వెంకటరమణ పాల్గొన్నారు.

క్షయపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

సాలూరు: రెండు వారాలకు మించిన దగ్గు క్షయ కావచ్చని టీబీ సూపర్‌వైజర్ నరేష్ అన్నారు. ఈ నెల 24న ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఏరియా ఆస్పత్రి నుంచి మెయిన్‌రోడ్డు వరకు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దగ్గుతున్నప్పుడు కఫం ద్వారా రక్తపు జీరలు పడడం, బరువు తగ్గడం, రెండు వారాలకు మించిన జ్వరం వంటివి క్షయ వ్యాధి లక్షణాలని అన్నారు.

ఈ లక్షణాలు గుర్తిస్తే వెంటనే స్థానిక వైద్య సిబ్బందికి లేదా ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గిరిజన రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 29వ తేదీన పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు అనిల్, వాసు తదితరులు పిలుపునిచ్చారు. ఇదే విషయమై రూపొందించిన వాల్‌పోస్టర్లను కురుపాం మండలంలోని మొండెంఖల్లు గ్రామంలో శనివారం ఆవిష్కరించారు. జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని, గుమ్మలక్ష్మీపురం, సాలూరు, సీతంపేట మండలాల్లో జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, అలాగే అన్ని గిరిజన గ్రామాలకు రోడ్లు, తాగునీరు, బస్సు సదుపాయాలు కల్పించాలని, పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని, నిరుపేద గిరిజనులకు ఇంటి స్థలంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, 3, 4, 5 తరగతుల విద్యార్థులను చదువుకు దూరం చేసే మోడల్ స్కూల్ విధానం నిలిపివేయాలని కోరారు.

పౌష్టికాహారం అందించాలి



శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీఓ శ్రీనివాసరావు

పార్వతీపురం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని సీడీపీఓ బి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని నర్సిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో పోషణబి పడాయిబి శిక్షణ కార్యక్రమంలో ఆయన శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో 126మంది అంగన్‌వాడీ వర్కర్లకు ప్రీస్కూల్ విద్యార్థులకు విద్య, పోషక పదార్థాలు నిర్వహణతో పాటు అంగవైకల్యం ఉన్న చిన్నారులకు పోషణ విద్య ఎలా అందించాలన్న దానిపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. చిన్నారులకు పలు కృత్యాల ద్వారా విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఈ నెల 24 నుంచి 26 వరకు రెండో విడత మినీ వర్కర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల అంగన్‌వాడీ వర్కర్లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనజీవామృతం తయారీపై అవగాహన



ఘనజీవామృతం తయారు చేయిస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ జమ్ము పంచాయతీ, పెంగవ గ్రామంలో ఘనజీవామృతం తయారీపై శనివారం అవగాహన కల్పించారు. జీవ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జి.ప్రబోధ్.. రైతులతో ఘనజీవామృతం తయారు చేయించారు. అనంతరం దాని ప్రయోజనాలు వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సహజ సిద్ధంగా లభించే ఆవుపేడ, మూత్రం వంటి వాటితో తయారు చేసుకునే ఈ ఘనజీవామృతం ఎరువును ఖరీఫ్ సీజన్‌లో తొలకరిజల్లులకు ముందు వేసుకుంటే నేల సారవంతమవుతుందని, ఆ తర్వాత అదే నేలలో వేసుకునే పంటలు బాగా పండుతాయన్నారు. కార్యక్రమంలో జట్టు కో-ఆర్డినేటర్ జి.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ కమిటీ సమావేశం

జియ్యమ్మవలస: మండలంలోని చినమేరంగి, తాళ్లడుమ్మ గ్రామాల్లో బాలల సంరక్షణ కమిటీ సమావేశాలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ విభాగం జిల్లా లీగల్ ప్రొహిబిషన్ అధికారి పి.శ్రీధర్ హాజరై, మాట్లాడారు. జీవో నంబరు 1 ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లాలోని పంచాయతీల్లో గ్రామస్థాయి పిల్లల సంరక్షణ సమావేశాలు చేపట్టాలన్నారు. పిల్లల సంరక్షణ, సంక్షేమం ముఖ్య ఉద్దేశంగా కమిటీ సభ్యులు పాటుపడాలని తెలిపారు. పిల్లలపై లైంగిక దాడులు, బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు. నెలలో రెండు సార్లు సమావేశాలు జరిపి, బాలల సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించాలన్నారు. సమావేశంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి రావాడ హరికృష్ణ, చినమేరంగి సచివాలయం మహిళా సంక్షేమ అధికారి ఎం.వాణి తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలు మెరుగుపరిచేందుకు శిక్షణ



పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాలు మెరుగుపడేలా శిక్షణ ద్వారా నైపుణ్యం పెంపొందించుకోవాలని డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు స్టాఫ్ నర్సులకు సూచించారు. పార్వతీపురంలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడారు. సాధారణ ప్రసవాలపై ఓరియంటేషన్ శిక్షణను పీహెచ్‌సీ స్టాఫ్‌నర్సులకు బ్యాచ్‌ల వారీగా ఇస్తున్నామన్నారు. మాతా శిశు మరణాలు తగ్గేలా, పీహెచ్‌సీ ప్రసవాలు మెరుగుపరిచేలా చేయడమే శిక్షణ ఉద్దేశమన్నారు. జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి.జగన్మోహనరావు, డాక్టర్ ఎం.వినోద్‌కుమార్, డీపీహెచ్‌ఎన్‌ఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. – పార్వతీపురం టౌన్

వసూళ్లపై సమగ్ర దర్యాప్తునకు డిమాండ్



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పార్వతీపురం టౌన్/రూరల్: తాళ్లబురిడి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల నుంచి చేస్తున్న వసూళ్లపై సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని కోరుతూ డీఈఓ ఎన్.తిరుపతినాయుడుకు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్‌తో పాటు పలువురు శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న 35మంది విద్యార్థుల నుంచి చెరో వెయ్యి రూపాయలు చొప్పున్న వసూళ్లు చేశారన్నారు. 9వ తరగతి విద్యార్థుల నుంచి రూ.500 చొప్పున్న వసూళ్లు చేశారన్నారు. కార్యక్రమంపై స్కూల్ కమిటీ చైర్మన్‌గాని, జెడ్పీటీసీనిగాని స్థానిక నాయకులకుగాని సమాచారం ఇవ్వకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. అక్రమ వసూళ్లపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

గోతులు పూడ్చేదెన్నడో...



రాయగడ మార్గంలో గోతుల మయమైన రహదారి

పార్వతీపురం: పట్టణ పరిసర ప్రాంతాల్లోని రోడ్లు గోతులమయంగా ఉండడంతో ప్రయాణాలు ప్రమాదకరంగా మారాయని ఓబీసీ పార్వతీపురం మన్యం జిల్లా చైర్మన్ వి.దాలినాయుడు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని రాయగడ రహదారి పరిధిలో గోతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంక్రాంతిలోగా గోతులను పూడ్చుతామంటూ చేసిన ప్రకటనలు అమలుకు నోచుకోలేదన్నారు. రాయగడ రహదారి పరిధిలోని డంపింగ్ యార్డు సమీపంలోని గోతుల్లో తరచు ప్రమాదాలు జరుగుతుండడంతో పలువురు అంగవైకల్యానికి గురవుతున్నారన్నారు. ఫ్లై ఓవర్, మెయిన్ రోడ్డు పరిధిలోని గురజాడ విగ్రహం వద్ద వెంకంపేట గోరీల వద్ద రహదారులు పూర్తిగా అధ్వానంగా ఉన్నాయన్నారు. అడ్డాపుశీల రహదారి పరిధిలో పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో రాకపోకలు చేసేందుకు నిత్యం వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు స్పందించి రహదారుల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఆయన వెంట ఎస్.సాయి శ్రీనివాస్, కె.కిరణ్‌కుమార్, బి.మోహన్‌రావు, ఎం.చంద్రకుమార్ తదితరులు ఉన్నారు.